సాక్షి
ప్రకాశం
బుధవారం । 26 । ఏప్రిల్ । 2023



మురుగునీరు మూడంచెల్లో శుద్ధి

ఒంగోలు నగరంలో మురుగునీరు వెళ్లే పోతురాజుకాలువపై మురుగునీటి శుద్ధి ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. దీనిని నేడు ప్రారంభిం చనున్నారు. - 8లో..



సీఎం జగన్‌కే జనం మద్దతు

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే జనం మద్దతుగా ఉన్నారని సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు అన్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
36 /26

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మలేరియా వ్యాధిపై అవగాహన ఉండాలి

- అవగాహన ర్యాలీని ప్రారంభించిన కలెక్టర్ దినేష్‌కుమార్



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: మలేరియా వ్యాధిపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. మంగళవారం ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా చేపట్టిన అవగాహన ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మలేరియా పూర్తిగా నివారించాలంటే ప్రజలకు అవగాహన ఉండాలన్నారు. దోమకాటుతో సంక్రమించే మలేరియా పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మనిషి రక్తంలో పరాన్నజీవులు చేరినపుడు మలేరియా సోకుతుందన్నారు. పరాన్నజీవుల సంక్రమణ జరిగిన 10–15 రోజుల్లో వ్యాధి లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఒక ఏడాదిపాటు మనిషి శరీరంలో నిద్రాణంగా ఉండే అవకాశం ఉందన్నారు. మలేరియా వ్యాధికి చికిత్స ఉందని గుర్తిస్తే వెంటనే వైద్య సేవలు పొందాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాంతకంగా మారుతుందని తెలిపారు. సంబంధిత శాఖలు క్షేత్రస్థాయిలో మలేరియా వ్యాధి ఏ విధంగా వస్తుంది... తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. దీనిలో మలేరియా నివారణ అధికారి జ్ఞానశ్రీ, డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి, ప్రోగ్రాం అధికారులు, ఏఎన్‌ఎంలు, ఆశాలు, నర్సింగ్ కాలేజి విద్యార్థులు పాల్గొన్నారు.

సచిన్‌ను కలసిన మార్కాపురం యువకుడు



సచిన్‌తో శశిధర్‌రెడ్డి

మార్కాపురం: ప్రముఖ క్రికెటర్ సచిన్ టెండూల్కర్‌ను ఆయన పుట్టిన రోజు సందర్భంగా వచ్చిన ప్రత్యేక ఆహ్వానం మేరకు మార్కాపురం యువకుడు కలిశాడు. స్థానిక ఆకాశవాణి ఉద్యోగి ఎం వెంకటేశ్వరరెడ్డి కుమారుడు శశిధర్‌రెడ్డి బీటెక్ పూర్తి చేసి క్రికెట్ ప్లేయర్‌గా రాణిస్తున్నాడు. వివిధ జిల్లాల్లో జరిగిన టోర్నమెంట్‌లో శశిధర్ రెడ్డి ఆడి మంచి బ్యాట్స్‌మెన్‌గా గుర్తింపు తెచ్చుకున్నాడు. సచిన్ టెండూల్కర్ 50వ జన్మదినోత్సవం సందర్భంగా దేశ వ్యాప్తంగా 50 మందిని ముంబాయిలోని తన నివాసానికి ఈ నెల 24న ఆహ్వానించాడు. అందులో తెలంగాణ నుంచి నలుగురిని, ఏపీ నుంచి మార్కాపురం వాసి శశిధర్‌రెడ్డిని ఆహ్వానించారు.

ఆర్మీ హాస్పిటల్ తనిఖీ

గిద్దలూరు రూరల్: గిద్దలూరు పట్టణంలోని మాజీ సైనికుకుల ఆర్మీ హాస్పిటల్ (ఈసీహెచ్‌ఎస్)లను ఆర్మీ అధికారి బ్రిగేడియర్ కే.సోమశేఖర్ సేనా మెడల్ పర్యటించారు. తొలుత గిద్దలూరు నియోజకవర్గంలోని మాజీ సైనికులు, ఆర్మీ ఉద్యోగులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. గిద్దలూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో మాజీ సైనికులు, ఆర్మీ ఉద్యోగులు తమ సమస్యలను ఆర్మీ ఆధికారి బ్రిగేడియర్ కే.సోమశేఖర్ దృష్టికి తీసుకెళ్లారు. రాచర్ల, కొమరోలు, గిద్దలూరు, బేస్తవారిపేట, అర్ధవీడు, కంభం మండలాల్లో ఎక్కువగా మాజీ సైనికులు ఉన్నారని గిద్దలూరు పట్టణంలో ఆర్మీ హాస్పిటల్ శాశ్విత భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలని మాజీ సైనికులు కోరారు. గిద్దలూరులో ఏర్పాటు చేసి ఆర్మీ క్యాంటీన్ సామర్థ్యాన్ని మరింత పెంచాలని కోరారు. అనంతరం సోమశేఖర్ మాట్లాడుతూ మాజీ సైనికుల సమస్యలను ఆర్మీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తమ సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆఫీసర్ ఇన్‌చార్జి వింగ్ కమాండర్ సురేంద్ర, లెఫ్టినెంట్ కల్నల్ వినోద్ కన్వాసి పాల్గొన్నారు.

ఉద్యోగాల పేరుతో మోసపూరిత ప్రకటనలు నమ్మవద్దు

ఒంగోలు: ఉద్యోగాల పేరుతో మోసపూరిత మాటలు ఎవరైనా చెబితే నమ్మవద్దని సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ పి.రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. విద్యాంజలి 2.0 పేరుతో కొన్ని సంస్థలు ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ అసిస్టెంట్ మొదలైన ఉద్యోగాలు ఇప్పిస్తామని పాఠశాలల్లో చేరేందుకు ఉత్తర్వులు ఇస్తున్నట్లు తెలియవచ్చిందన్నారు. సదరు నియామకాలకు సంబంధించి ఉన్నతాధికారుల నుంచి ఎటువంటి ఆదేశాలు రాలేదని, ఇటువంటి నియామకాల పట్ల ఉద్యోగార్థులు జగరూకత వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి విజ్ఞప్తి చేశారు.

టిడ్కో.. సెల్ఫీ పచ్చ డ్రామా..!

పట్టణ, నగరాల్లో పేదలకు పక్కా గృహాల నిర్మాణాల్లో గత టీడీపీ ప్రభుత్వం మాయాజాలం చేసింది. పేదలకు ఇళ్ల నిర్మాణాలు చేపడుతోందని చంద్రబాబు ఆర్భాటపు ప్రకటనలు . సాధారణ ఎన్నికలు వచ్చే వరకూ కాలక్షేపం చేసింది. ఆంధ్రప్రదేశ్ పట్టణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (టిడ్కో) ఇళ్ల నిర్మాణాలు చేస్తున్నామని నటిస్తూ వచ్చింది. సార్వత్రిక ఎన్నికలు సమీపించే సమయంలో హడావుడిగా తూతూ మంత్రంగా పనులు చేపట్టి గాలికొదిలేసి. కేంద్రం తన వాటాగా ఇచ్చిన నిధులతో మాత్రమే పనులు చేపట్టి చేతులు దులుపుకుంది. వాటిని చక్కటి మౌలిక వసతులతో పూర్తి చేసి పేదలకు అందించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పూనుకుంది. టిడ్కో ఇళ్లపై వాస్తవం ఇదీ..

- వాస్తవాన్ని వక్రీకరిస్తూ విష,అసత్య ప్రచారం
- పేదల ఇళ్ల నిర్మాణంలో నాటి టీడీపీ ప్రభుత్వం దగా
- ఉమ్మడి ప్రకాశంలో 9568 టిడ్కో గృహాలు నిర్మించేందుకు లబ్ధిదారుల ఎంపిక
- 30 శాతం కూడా పూర్తిచేయని వైనం
- అసంపూర్తి ఇళ్లను పూర్తి చేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- అదనంగా రూ.350 కోట్లు కేటాయింపు
- 6112 ఇళ్లను ఉచితంగా ఇస్తున్న ప్రభుత్వం
- నాడు మోసం చేసి నేడు ఆ గృహాలు వద్ద దామచర్ల సెల్ఫీ
- మండిపడ్డ ఎమ్మెల్యే బాలినేని



చింతల వద్ద ప్రస్తుతం వేగంగా జరుగుతున్న టిడ్కో ఇళ్ల నిర్మాణ పనులు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 9,568 టిడ్కో గృహాలకు నిర్మించేందుకు రూ.482 కోట్లు ప్రాజెక్టు వ్యయం అవుతుందని టీడీపీ ప్రభుత్వ హయాంలో అంచనాలు రూపొందించింది. ఒంగోలు నగరంతోపాటు కందుకూరు, మార్కాపురం, గిద్దలూరు, అద్దంకి, కనిగిరి మున్సిపాలిటీల్లో టిడ్కో ఇళ్లు నిర్మించాలని భావించింది. ఒంగోలు నగరంలో చింతల, కొప్పోలుల్లో కలిపి 4,128 గృహాలు నిర్మించాలని స్థలాల ఎంపిక కార్యక్రమాన్ని పూర్తి చేశారు. మార్కాపురంలోని పెద్దనాగులాపురం రోడ్డులో 912 మందికి, గిద్దలూరు మోడెంపల్లిలో 1248 మందికి, కనిగిరి చాకిరాలలో 912 మందికి, అద్దంకి శింగరకొండలో 960 మందికి, కందుకూరు ఉప్పుచెరువు వద్ద 1408 మందికి టిడ్కో గృహాలు నిర్మించి ఇవ్వాలని ఏర్పాట్లు చేశారు.

30 శాతం కూడా నిర్మాణం పూర్తి చేయని టీడీపీ ప్రభుత్వం:

జిల్లాలోని టిడ్కో గృహాల నిర్మాణ పనులను టీడీపీ ప్రభుత్వం కనీసం 30 శాతం కూడా పూర్తి చేయలేదు. కొన్ని ప్రాంతాల్లో పునాదులు లేపి వదిలేశారు. కొన్నింటిలో మాత్రం స్లాబులు మాత్రమే వేశారు. మొత్తం రూ.482 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంది. అందులో కేవలం రూ.145.32 కోట్లు మాత్రమే ఖర్చుచేసింది. అదికూడా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదు. మొత్తం కేంద్ర ప్రభుత్వం తన వాటాగా ఇచ్చిన మొత్తాన్ని ఖర్చుచేసి తాము టిడ్కో గృహాలను దాదాపు పూర్తి చేశామని డప్పు కొట్టుకుంది.

6,112 గృహాలు ఉచితంగా ఇస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం:

ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తన ప్రజా సంకల్ప యాత్రలో 300 చదరపు గజాల టిడ్కో ఇంటిని ఉచితంగా ఇస్తానని హామీ ఇచ్చారు. టిడ్కో ఇళ్ల కోసం నగదు చెల్లించిన లబ్ధిదారులు దాదాపు 6,112 మంది ఉన్నారని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. అసంపూర్తిగా ఉన్న ఇళ్లను నిర్మించేందుకు పూనుకుంది. ఇందుకు సంబంధించి రూ.350 కోట్లు కేటాయించింది. రివర్స్ టెండర్ల ద్వారా పనులు చేపట్టింది. ఒంగోలు, గిద్దలూరు, కనిగిరి, మార్కాపురం పట్టణాల్లో ఇళ్ల నిర్మాణ ప్రక్రియను పూర్తి చేసింది. మొదటి విడతగా 2,640 గృహాలకు రివర్స్ టెండర్‌లో 11 శాతం లెస్‌కు టెండర్లు కోట్ చేయడంతో రాష్ట్ర ప్రభుత్వానికి రూ.23.34 కోట్లు మిగిలింది. వీటి నిర్మాణాలు వేగవంతంగా జరుగుతున్నాయి. మిగతా గృహాలకు ఫేజ్-2, ఫేజ్-3 కింద పనులు చేపట్టేందుకు ముమ్మర యత్నాలు చేస్తున్నారు.

రూ.12.72 కోట్లు పసుపు, కుంకుమకు:

టిడ్కో గృహాల్లో లబ్ధిదారుల నుంచి వసూలు చేసిన మొత్తం రూ.12.72 కోట్లను చంద్రబాబు నాయుడు 2019 ఎన్నికల సమయంలో పసుపు–కుంకుమకు ఖర్చు చేశారు. ఆ నిధులను టిడ్కో గృహాల కోసం వెచ్చించాల్సి ఉంటే వాటిని కూడా పసుపు–కుంకుమకు ఇచ్చి ఓట్లు దండుకోవాలని చూశాడు. ఇళ్లపేరుతో నాడు పేద ప్రజలను మోసం చేసిన టీడీపీ నేతలు నేడు సెల్ఫీల పేరుతో ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలను ప్రజలు ఈసడించుకుంటున్నారు. అధికారంలో ఉన్న ఐదేళ్లూ పట్టించుకోకుండా కాలక్షేపం చేసి నేడు మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ సెల్ఫీ చాలెంజ్ చేయడం విడ్డూరంగా ఉందని విమర్శిస్తున్నారు.

సిగ్గులేకుండా దామచర్ల సెల్ఫీనా....



ఒంగోలు నగరంలో ఇళ్లు నిర్మిస్తామని 15,500 మంది వద్ద నుంచి టీడీపీ నేతలు డబ్బులు కట్టించుకున్నారు. కేవలం 4 వేల ఇళ్లు మాత్రమే ప్రారంభించారు. ప్రజల నుంచి కట్టించుకున్న డబ్బును ఏం చేశారో తెలియదు. కానీ టీడీపీకి చెందిన ఒంగోలు మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ సోమవారం టిడ్కో ఇళ్ల వద్దకు వెళ్లి సిగ్గులేకుండా సెల్ఫీ వీడియో దిగటం సరికాదు. అప్పట్లో ప్రజల వద్ద వసూలు చేసిన సొమ్మును ఇప్పుడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తిరిగి ప్రజలకు అందజేస్తోంది. తగుదనమ్మా అంటూ దామచర్ల సెల్ఫీ వీడియో దిగి ప్రజలకు ఏమని సంకేతాలు ఇద్దామనుకుంటున్నాడో వాళ్ల విజ్ఞతకే వదిలేస్తున్నాను. ఒంగోలు నగరంలోని చింతలలో రూ.98 కోట్లు ఖర్చుచేసి 1392 ఇళ్లు టీడీపీ హయాంలో పూర్తి చేశామని టీడీపీ వాళ్లు చెబుతున్నారు. అది పూర్తిగా అబద్ధం. ఆ ప్రాజెక్టు మొత్తం వ్యయ అంచనాలు రూపొందించిందే రూ.81.80 కోట్లు. అందులో రూ.45.18 కోట్ల విలువైన పనులు మాత్రమే జరిగాయి. ఇంకా 55.23 శాతం పనులు జరగాల్సి ఉంది. ఇకపోతే కొప్పోలు ప్రాజెక్టులో 4656 గృహాలకు నిర్మాణ పనులు చేపట్టి రూ.450 కోట్లు ఖర్చు చేశామని చెబుతున్నారు. అన్నీ అబద్ధాలే చెబుతూ ఇప్పటికీ ప్రజలను మోసం చేస్తున్నారు.

– బాలినేని శ్రీనివాస రెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే

వేసవిలో నీటి, విద్యుత్ సమస్యలకు చెక్

- జిల్లా అభివృద్ధికి డీఆర్‌సీ తోడ్పడుతుంది
- మౌలిక వసతుల కల్పనకూ దోహదం
- అధికార యంత్రాంగం చిత్తశుద్ధితో పనిచేయాలి
- డీఆర్‌సీ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి మేరుగు నాగార్జున



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగు నాగార్జున, పక్కన మంత్రి సురేష్

ఒంగోలు అర్బన్: వేసవిలో తాగునీరు, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి మేరుగు నాగార్జున అధికారులకు సూచించారు. మంగళవారం స్పందన భవనంలో ఆయన అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమీక్షా మండలి (డీఆర్‌సీ) సమావేశం నిర్వహించారు. రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, రాష్ట్ర ప్రభుత్వ సామాజిక న్యాయ సలహాదారు జూపూడి ప్రభాకర్, పీడీసీసీ బ్యాంకు చైర్మన్ మాదాసి వెంకయ్య, ఎమ్మెల్యేలు పాల్గొని జిల్లా సమగ్రాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, ప్రస్తుత స్థితిగతులపై సుదీర్ఘంగా చర్చించారు. జిల్లా అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు డీఆర్‌సీ సమావేశం ఎంతగానో తోడ్పడుతుందని, జిల్లా ప్రజల తాత్కాలిక అవసరాలు తీర్చడం, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి మేరుగ అధికారులకు సూచించారు.

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అధికార యంత్రాంగం చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. సీఎం వైఎస్ జగన్ ఆలోచనలకు అనుగుణంగా ప్రజలకు ఏ ఇబ్బంది లేకుండా పనిచేయాలన్నారు. నిధుల సమస్యలు ఉంటే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని చెప్పారు. గడపగడపకూ కార్యక్రమంలో ప్రజలు తెలిపిన సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. పేదలందరికీ ఇళ్లు కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తున్నందున ఇసుక విషయంలో పేదలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. స్థానిక వాగుల నుంచి ఇళ్ల అవసరాల కోసం తీసుకువెళ్తున్న ఇసుకను జేపీ సంస్థ ప్రతినిధులు అడ్డుకుని ఇబ్బందులు కలిగిస్తున్నట్లు ప్రజలు తెలుపుతున్నారని, ఈ విషయంలో ఆ సంస్థ ప్రతినిధులకు అధికారులు నిర్దిష్ట ఆదేశాలు ఇవ్వాలని స్పష్టం చేశారు. చీమకుర్తి మూడో వార్డులో మద్యం దుకాణం తొలగింపు విషయాన్ని కలెక్టర్ దృష్టికి ఎందుకు తీసుకువెళ్లలేదని ఎక్సైజ్ అధికారులపై మంత్రి నాగార్జున ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే మద్యం షాపును తొలగించాలని ఆదేశించారు.

వెలిగొండ ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్ సరళావందనం మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్టు కింద మొత్తం 7,222 నిర్వాసిత కుటుంబాలను గుర్తించామన్నారు. అందులో 4,317 కుటుంబాలకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజిని కలెక్టర్ ఆమోదించారన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె శ్రీనివాసులు, మార్కాపురం సబ్‌కలెక్టర్ సేతు మాధవన్, డీఆర్‌ఓ ఆర్ శ్రీలత, ఒంగోలు, కనిగిరి ఆర్‌డీవోలు విశ్వేశ్వరరావు, అజయ్‌కుమార్, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సాగర్ జలాల వాటా తప్పనిసరిగా అందాలి

నాగార్జున సాగర్ నుంచి జిల్లాకు అందాల్సిన నీటి వాటా అందాలి. సీపీడబ్ల్యూ పథకాలకు నూతన జవసత్వాలు ఇచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. ఓ అండ్ ఎం పనులను నిర్లక్ష్యం చేసేవారిని బ్లాక్ లిస్ట్‌లో ఉంచాలి. నాటుసారా తయారీని అడ్డుకునే క్రమంలో అమాయక గిరిజనులను ఇబ్బందులు పెట్టకుండా క్షేత్రస్థాయి విషయాల పట్ల ఎక్సైజ్ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలి. వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులవుతున్న ప్రతి కుటుంబానికి న్యాయం జరిగేలా అధికారులు చూడాలి.

– రాష్ట్ర మంత్రి ఆదిమూలపు సురేష్

అందరి సహకారంతో జిల్లా అభివృద్ధికి కృషి

ప్రజాప్రతినిధులు, మంత్రులు అందరి సహకారంతో జిల్లాను అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకుంటాం. డీఆర్‌సీలో ప్రజాప్రతినిధులు ప్రస్తావించిన ప్రతి అంశాన్ని ప్రత్యేక శ్రద్ధతో చర్యలు తీసుకునేలా చూస్తా.

– కలెక్టర్ దినేష్‌కుమార్

సంక్షేమం..అభివృద్ధిని బ్యాలెన్స్ చేస్తున్నారు

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారు. సంక్షేమంతో పాటు అభివృద్ధిని బ్యాలెన్స్ చేస్తున్నారు. ఈ సమావేశంలో చర్చించిన వాటిని పరిష్కరించి జిల్లాను అభివృద్ధి చేయాలి.

– బూచేపల్లి వెంకాయమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్

పేదల పక్షపాతి జగన్

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేదల పక్షపాతి సీఎం వైఎస్ జగన్. బడుగు బలహీన వర్గాలకు ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను గుర్తించి వారి అభివృద్ధికి జిల్లా యంత్రాంగం కృషి చేయాలి. వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలి.

– జూపూడి ప్రభాకర్

అర్హులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

పేదలందరికీ ఇళ్ల పథకంలో పేర్నమిట్టలో అర్హులుగా గుర్తించిన మూడు వేల మందికి ఒంగోలు మండల పరిధిలో స్థలాలు ఇవ్వాలని అధికారులు యోచిస్తున్నారు. అయితే పేర్నమిట్టలోనే స్థలం చూసి పట్టాలు ఇవ్వాలి. కొన్ని చోట్ల లెవలింగ్ పనులకు బిల్లులు చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని త్వరగా చెల్లించాలి. చీమకుర్తిలో మూడో వార్డులో రద్దీగా ఉండే ప్రదేశంలో ప్రభుత్వ మద్యం దుకాణం ఉంది. దీంతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. ఉప్పుగుండూరులో జనాభా ఎక్కువగా ఉన్నందున స్థానిక పరిస్థితులను పరిగణలోకి తీసుకుని 50 పడకల ఆస్పత్రిని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలి. ఒంగోలు–పొదిలి రహదారిని 4 లైన్‌లుగా విస్తరించాలి.

– టీజేఆర్ సుధాకర్ బాబు, సంతనూతలపాడు ఎమ్మెల్యే

నీటి సరఫరాలో లోపాలు లేకుండా చూడాలి

కురిచేడులో ఫిల్టర్‌బెడ్ సరిగా లేనందున నీటి సరఫరాలో తరచూ సమస్యలు వస్తున్నాయి. పైప్‌లైన్లు పగిలిపోవడం, మోటారు రిపేర్‌లు వంటి సమస్యలు తరచూ వస్తున్నాయి. ఓటీఎస్ కింద డబ్బులు కట్టిన వారు ఇప్పటికీ పట్టాలు రాలేదని గడపగడపకు కార్యక్రమంలో అడుగుతున్నారు. ఆ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి. అమృత్ పథకంలో మంజూరైన పనులు చేపట్టేందుకు అధికారులు త్వరగా టెండర్ నోటిఫికేషన్ ఇచ్చేలా చూడాలి.

– మద్దిశెట్టి వేణుగోపాల్, దర్శి ఎమ్మెల్యే

తాగునీటి ట్యాంకర్ బిల్లులు చెల్లించాలి

తాగునీటిని సరఫరా చేసే ట్యాంకర్లకు సంబంధించిన బిల్లులు వేగంగా చెల్లించేలా చూడాలి. ప్రజలకు, పశువులకు నీటి అవసరాలను తీర్చేలా ఆర్ డబ్ల్యూఎస్, పశుసంవర్ధక శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలి. స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు జిల్లాలోనే కనీసం 25 శాతం విక్రయాలు జరిగేలా చర్యలు తీసుకోవాలి. ప్రతి మండలం కేంద్రంలో 500 మంది సామర్థ్యం ఉండేలా కమ్యూనిటీ హాళ్లను నిర్మించేలా చర్యలు తీసుకోవాలి.

– కే నాగార్జున రెడ్డి, మార్కాపురం ఎమ్మెల్యే

తవ్విన రోడ్లను త్వరగా మరమ్మతులు చేయాలి

నియోజకవర్గంలో తవ్విన రోడ్లలో త్వరగా మరమ్మతులు చేయాలి. అదేవిధంగా నీటి సమస్యను పరిష్కరించాలి. కనిగిరిలో ఆస్పత్రి సామర్థ్యం వంద పడకలకు పెంచేలా చర్యలు తీసుకోవాలి. వెలిగండ్ల మండలం పాలేటిపాలెం బ్రిడ్జిని త్వరగా పూర్తి చేయాలి. ఈ పనులు పూర్తి కాకపోవడంతో వర్షాకాలంలో సుమారు పది గ్రామాలకు రాకపోకలు ఇబ్బందిగా ఉంటుంది.

– బుర్రా మధుసూదన్ యాదవ్, కనిగిరి ఎమ్మెల్యే

తాగునీటి సమస్య పరిష్కరించాలి

గిద్దలూరులో తాగునీటి సమస్య పరిష్కరించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి. గిద్దలూరుకు నీళ్ల కోసం గొట్టిపడియ వద్ద మోటార్లు బిగించేందుకు ప్రభుత్వం నుంచి అనుమతి ఇప్పించాలి. వెలగలపాయ, పాపినేనిపల్లికి తాగునీరు కోసం ఇన్‌టెక్‌వెల్ కావాలి. కొమరోలు, బేస్తవారిపేట పరిధిలో అటవీ ప్రాంతాన్ని ఒంగోలు డివిజన్‌లో కలపడం సరికాదు.

– అన్నా రాంబాబు, ఎమ్మెల్యే గిద్దలూరు

టిడ్కో ఇళ్ల పేరుతో వంచించిన టీడీపీ



విలేకరులతో మాట్లాడుతున్న బాలినేని శ్రీనివాసరెడ్డి

- ఇళ్లు మంజూరు కాకుండానే డబ్బులు కట్టించుకొని మోసం
- సిగ్గు లేకుండా టిడ్కో ఇళ్ల వద్ద సెల్ఫీ ఛాలెంజ్ చేస్తావా జనార్దనా
- ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి ధ్వజం

ఒంగోలు సబర్బన్: టిడ్కో ఇళ్ల పేరుతో టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రజలను నిలువునా మోసం చేశారని ఒంగోలు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి మండిపడ్డారు. అసలు ఇళ్లు మంజూరు కాకుండానే ప్రజల వద్ద నుంచి డబ్బులు ఎలా కట్టించుకున్నారని నిలదీశారు. ఇంకా సిగ్గు లేకుండా టీడీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ టిడ్కో ఇళ్ల వద్ద సెల్ఫీ ఛాలెంజ్ అంటూ ఫొటోలు దిగుతారా అని ప్రశ్నించారు. ఒంగోలు నగరంలోని 5వ డివిజన్‌లో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బాలినేని శ్రీనివాస రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం నుంచి వస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరును నేరుగా ప్రజలను అడిగి తెలుసుకున్నారు. గోపాల్ నగర్ ఎక్స్‌టెన్షన్‌లోని ఇటుక బట్టీల రోడ్డులో పలు ప్రాంతాల్లో ఇంటింటికీ తిరిగారు. ఈ సందర్భంగా బాలినేని మీడియాతో మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో టిడ్కో ఇళ్ల పేరుతో ప్రజలను నిలువునా వంచించారన్నారు. టిడ్కో ఇళ్ల వద్దకు వచ్చి సెల్ఫీ ఫొటోలు తీసుకునే అర్హత నీకు ఉందా దామచర్ల జనార్దన్ అని ప్రశ్నించారు. ఎవరైనా ఇళ్లు మంజూరు కాకుండానే ప్రజల వద్ద నుంచి డబ్బులు కట్టించుకుంటారా... సరే ఇళ్లు మంజూరు కాలేదు, అలాంటప్పుడు వాళ్ల డబ్బులు వాళ్లకు ఇవ్వాలా..లేదా అని నిలదీశారు. 14,500 మంది దగ్గర డబ్బులు కట్టించుకొని 4 వేల ఇళ్లు ప్రారంభిస్తారా... అలాంటప్పుడు అంతమంది దగ్గర ఎందుకు డబ్బులు కట్టించుకున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ఒక్కొక్కరి వద్ద నుంచి రూ.75 వేలు వసూలు చేశారని..ఆ విధంగా ఒక్క ఒంగోలు నగరంలోనే రూ.16 కోట్లు కట్టించుకొని నిలువునా ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. అసలు ఆ డబ్బులు ఏం చేశారో చెప్పాలని జనార్దన్‌ను నిలదీశారు. వాళ్ల చేసిన మోసానికి డబ్బులు కట్టిన లబ్ధిదారులు మమ్మల్ని అడుగుతున్నారని గుర్తు చేశారు. ఆ డబ్బులు ఎన్నికల సమయంలో పసుపు–కుంకుమ పేరుతో పంచారన్నారు. ప్రస్తుతం తాము ప్రభుత్వం నుంచి డబ్బులు తెప్పించి ఇచ్చే పనిలో పడ్డామన్నారు. జనార్దన్ చేసిన పాపానికి ఒంగోలు నగరంలోని ప్రజలు ఎంత ఇబ్బందులు పడ్డారో స్పష్టంగా అర్థమవుతోందన్నారు. యరజర్ల వద్ద 25 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇద్దామని అన్నీ సిద్ధం చేస్తే కోర్టుకు వెళ్లి పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వనీయకుండా ఆపారన్నారు. అందుకే రైతుల వద్ద భూములు కొనుగోలు చేసి ఇళ్లులేని నిరుపేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు రంగం సిద్ధం చేశామని బాలినేని పేర్కొన్నారు. రెండు, మూడు నెలల్లో 25 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇస్తాం , అందరికీ ఇళ్లు కట్టించి ఇస్తామని ధీమాగా చెప్పారు. ప్రజలను మోసం చేసింది కాక సిగ్గు లేకుండా సెల్ఫీ ఛాలెంజ్‌లంటూ ఫొటోలకు ఫోజులిస్తావా..అందుకే ప్రజలు 2019 ఎన్నికల్లో ఓడించినా ఇంకా టీడీపీ నాయకులకు బుద్ధిరాలేదని ధ్వజమెత్తారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో బాలినేనితో పాటు కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధు సూదన్ యాదవ్ కూడా పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, 5వ డివిజన్ కార్పొరేటర్ ఎందేటి పద్మావతి రంగారావు, పార్టీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు కఠారి శంకర్, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గంటా రామానాయుడు, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ గోనుగుంట రజనీ, ఒంగోలు ఏఎంసీ చైర్మన్ కొఠారి రామచంద్రరావు, పీవీ నాయుడు, మహిళా విభాగం జిల్లా పార్టీ అధ్యక్షురాలు తమ్మినేని మాధవి, కార్పొరేటర్లు చల్లా తిరుమలరావు, ట్రేడ్ యూనియన్ నాయకులు పుచ్చకాయల గోవర్దన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు గొర్రెపాటి శ్రీనివాసులు, మారెళ్ల శ్రీనివాసులు, పురిణి ప్రభావతి, డి.క్రాంతికుమార్, భూమిరెడ్డి రమణమ్మ, పుట్టా సుధాకర రెడ్డి, పలుపులేటి శ్రీనివాసరావు, గోలి తిరుపతిరావు, బొమ్మినేని మురళి, తూము పద్మ, బైరెడ్డి అరుణ, గోలి తిరుపతి రావు, నక్కల లీలా కుమారి, మీరావలి, మోడుబోయిన సురేష్, డివిజన్ నాయకులు డివిజన్ అధ్యక్షుడు సీహెచ్ సత్యనారాయణ రెడ్డి, తాళ్లపాలెం శ్రీను, జమ్ము శ్రీకాంత్, వాకా తిరుమల, పి.మోహన్ రావు, బొట్ల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



గ్రోత్‌సెంటర్‌లో లభ్యమైన మృతదేహం

మద్దిపాడు: మండలంలోని గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం సాయంత్రం వెలుగు చూసింది. ఎస్సై శ్రీకాంత్ అందించిన సమాచారం మేరకు..గుండ్లాపల్లి గ్రోత్‌సెంటర్‌లోని టెక్‌బుల్స్ సాఫ్ట్‌వేర్ కంపెనీ వెనుక భాగంలో ఒక యువకుని మృతదేహం ఉన్నట్లు గ్రోత్ సెంటర్‌లోని వ్యక్తులు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఘటనా ప్రాంతంలో మృతునికి సంబంధించిన ఎటువంటి ఆధారాలు లభించకలేదు. చుట్టుపక్కల వారిని విచారించినా ఫలితం లేకపోవడంతో మృతదేహాన్ని ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. మృతుని ఫొటోలను అన్ని పోలీస్‌స్టేషన్‌లకు పంపనున్నట్లు ఆయన తెలిపారు. మృతుని సమాచారం తెలిసిన వారు ఎవరైనా ఉంటే మద్దిపాడు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. మృతుడు బీహార్, ఛత్తీస్‌ఘడ్ వైపుకు చెందినవాడు అయి ఉండవచ్చని, పని నిమిత్తం గ్రోత్ సెంటర్‌కు చేరుకుని ఉండవచ్చని భావిస్తున్నారు.

సీనియార్టీ జాబితాను నమోదు చేసుకోవాలి

ఒంగోలు టౌన్: జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్ మేనేజ్‌మెంట్లో స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్ పదోన్నతుల కోసం సీనియార్టీ నమోదు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన ఎస్జీటీ ఉపాధ్యాయులు వారి విద్యార్హతలు, ఎస్‌ఆర్ నకలి కాపీ జతపరిచిన దరఖాస్తును సంబంధిత ఎంఈఓల ద్వారా డీఈఓ కార్యాలయానికి ఈనెల 27వ తేదీ ఉదయం 10 గంటల లోగా సమర్పించాలన్నారు. స్పెషల్ ఎడ్యుకేషన్ పదోన్నతుల సీనియార్టీ జాబితాలో నమోదు చేసుకోవాలని తెలిపారు.

విద్యుత్ తీగలు తగిలి యువకుడు మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై కోటయ్య

యర్రగొండపాలెం: మండలంలోని గుర్రపుశాల పొలాల్లో విద్యుత్ తీగలు తగిలి యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన మంగళవారం జరిగింది. ఎస్సై జి.కోటయ్య కథనం ప్రకారం అనంతపురంకు చెందిన శ్రీనాథ్ (26) రైతులు ఉపయోగించి పక్కన పడేసిన డ్రిప్ వైర్లను కొనుగోలు చేస్తుంటాడు. ఈ క్రమంలో గుర్రపుశాల పొలాల్లో ఉన్న డ్రిప్ వైర్లను తీసుకువెళ్లేందుకు శ్రీనాథ్ బొలేరో వాహనం క్యాబిన్‌పై కూర్చొని వెళ్తున్న సమయంలో వేలాడుతున్న విద్యుత్ తీగలు అతనికి తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

- రూ. 30.79 కోట్లతో ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మాణం
- గుత్తికొండవారిపాలెం వద్ద పోతురాజు కాలువపై నిర్మాణం
- శుద్ధి చేసిన నీటిని చెట్లకు సరఫరా చేసేలా ఏర్పాట్లు
- ఆక్వా, పంట పొలాలకు వినియోగించుకోవచ్చు
- ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని చొరవతో పనులు పూర్తి
- నేడు బాలినేని చేతుల మీదుగా ప్రారంభం

మురుగునీరు.. మూడంచెల్లో శుద్ధి



గుత్తికొండవారిపాలెం వద్ద నిర్మించిన మురుగు నీటి శుద్ధి కేంద్రం

ఒంగోలు సబర్బన్: పర్యావరణ పరిరక్షణలో భాగంగా మురుగునీటిని శుద్ధిచేసేందుకు ఒంగోలు నగరంలో ప్రత్యేకంగా ప్లాంట్‌ను నిర్మించారు. ఒంగోలు నగరంలోని మురుగు నీరంతా పోతురాజు కాలువ ద్వారానే బయటకు వెళ్లేది. ఈ కాలువ ద్వారా మురుగు నీరు మొత్తం కొత్తపట్నం మండలం పాదర్తి వద్ద సముద్రంలో కలుస్తుంది. అయితే ఈ మురుగు వల్ల సముద్రంలో జల చరాలకు ముప్పు వాటిల్లకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మురుగునీటి శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాయి. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నియమ నిబంధనల మేరకు నగరం పరిధిలోని కొప్పోలు-పాదర్తి రోడ్డులో గుత్తికొండవారిపాలెం వద్ద పోతురాజు కాలువపై ఈ మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని నిర్మించారు. లక్ష జనాభాకు మించి ఉన్న ప్రతి నగరంలో ఇలాంటి మురుగు శుద్ధి చేసే ప్లాంట్లను నిర్మించాలని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నిర్దేశించింది. ఈ ప్లాంట్‌ను బుధవారం వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రారంభించనున్నారు.

రూ.30.79 కోట్లతో నిర్మాణం...

కేంద్ర ప్రభుత్వం మురుగునీటి శుద్ధి కేంద్రం నిర్మాణానికి రూ.30.79 కోట్లు మంజూరు చేసింది. అందులో ప్లాంట్ నిర్మాణానికి రూ.22.37 కోట్లు ఖర్చు చేశారు. మిగిలిన మొత్తం ప్లాంట్ నిర్వహణకు వినియోగిస్తారు. పదేళ్ల పాటు పోతురాజు కాలువ ద్వారా వదిలే మురుగును శుద్ధి చేసేలా ప్రణాళికలు రూపొందించారు. అమృత్ స్కీం కింద మంజూరైన నిధులతో నిర్మించిన ఈ ప్లాంట్ ద్వారా ప్రతి రోజూ 1.50 కోట్ల లీటర్ల మురుగు నీటిని శుద్ధి చేయనున్నారు.

శుద్ధి చేసి సముద్రంలోకి..

ఈ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ద్వారా పోతురాజు కాలువ ద్వారా వచ్చే మురుగును మూడు రకాల పద్ధతుల్లో వేరు చేస్తారు. పోతురాజు కాలువపై గుత్తికొండవారి పాలెం వద్ద చెక్‌డ్యాం నిర్మించారు. ఈ చెక్‌డ్యాం వద్ద నుంచి పోతురాజుకాలువ ద్వారా వచ్చే మురుగునీటిని ప్లాంట్‌లోకి మళ్లిస్తారు. అక్కడ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించిన మిషనరీలతో మూడు పద్ధతుల్లో మురుగును వేరు చేస్తారు. మొదటి పద్ధతిలో మురుగునీటిలో వచ్చే 20 ఎంఎం సైజు వ్యర్థాలను వేరుచేస్తారు. ఆ తరువాత 10 ఎంఎం సైజు వ్యర్థాలను వేరుచేస్తారు. రెండో పద్ధతిలో వచ్చే మురుగులో మడ్డి, ఇసుకను వేరు చేస్తారు. మూడో పద్ధతిలో శుద్ధి చేసిన నీటిలో క్లోరిన్ కలిపి చెక్‌డ్యాం కిందకు వదులుతారు. ఆ నీరు నేరుగా సముద్రంలో కలవటం వల్ల సముద్రంలోని మత్స్య సంపదకు ఎలాంటి హాని లేకుండా చర్యలు తీసుకుంటారు.

ఆక్వా చెరువులు, పంట పొలాలకు వాడుకోవచ్చు...

శుద్ధి చేసి క్లోరిన్ కలిపిన నీటిని ఆక్వా చెరువులు, పంట పొలాలకు కూడా వాడుకోవచ్చు. అదేవిధంగా రోడ్ల వెంట ఉన్న చెట్లకు, మొక్కలకు కూడా ఈ నీటిని వాడుకుంటే మంచి ప్రయోజనాలు ఉంటాయి. ప్లాంట్‌లోని నీటిని ట్యాంకర్ల ద్వారా రోడ్ల వెంట ఉన్న చెట్లకు, మొక్కలకు వాడుకొని నీటి వృథాను కూడా అరికట్టవచ్చు.

సెప్టిక్ ట్యాంకుల వ్యర్థాలు సైతం శుద్ధి

గుత్తికొండవారిపాలెంలోని ప్లాంట్‌లో ప్రత్యేకంగా సెప్టిక్ ట్యాంకులు తెచ్చే వ్యర్థాలను కూడా శుద్ధి చేసే ప్లాంట్‌ను కూడా ఇక్కడ ఏర్పాటు చేశారు. అందుకోసం ప్రత్యేకంగా ఒక విభాగాన్ని ఈ ప్లాంటులో నిర్మించారు. ఒంగోలు నగరంతో పాటు పరిసర ప్రాంతాలలోని గ్రామాలు, పట్టణాల్లో సెప్టిక్ ట్యాంకుల నుంచి బయటకు తీసిన వ్యర్థాలను ఇక్కడకు తీసుకొస్తే దానిని కూడా శుద్ధి చేస్తారు. ఇక నుంచి ఎక్కడ పడితే అక్కడ సెప్టిక్ ట్యాంకుల నుంచి తీసే వ్యర్థాలను పడేయకుండా చర్యలు తీసుకోనున్నారు. అందుకు ప్రత్యేకంగా ఈ ప్లాంటు నిర్వాహకులు రుసుం వసూలు చేస్తారు.



మురుగునీటిని శుద్ధి చేస్తున్న యూనిట్



వేరు చేసిన మురుగును నిల్వ చేసిన ప్లాంటు

ప్లాంట్‌తో ఎన్నో ప్రయోజనాలు



ట్రీట్‌మెంట్ ప్లాంట్ పర్యావరణానికి ఎంతో మేలు చేస్తుంది. ఎలాంటి మురుగునీరు సముద్రంలోకి వెళ్లకుండా ఈ ప్లాంటు ద్వారా ప్రయోజనం చేకూరనుంది. ఈ ప్లాంటు నిర్మాణానికి బాలినేని ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఆక్వా చెరువులకు, పంట పొలాలకు మిషన్ల ద్వారా ఈ నీటిని వాడుకోవచ్చు. ప్లాంట్‌ను ఉదయం 10 గంటలకు బాలినేని ప్రజలకు అంకితం చేయనున్నారు.

– ఎం.వెంకటేశ్వరరావు, ఒంగోలు నగర కమిషనర్

చిన్నారులకు సరైన పోషకాహారం అందించాలి



ఏడుగుండ్లపాడు ఎలిమెంటరీ పాఠశాలలలో రికార్డులు పరిశీలిస్తున్న ఉమెన్ చైల్డ్ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ ముద్దాడ రవి చంద్రతో అధికారులు

- ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ రవిచంద్ర

మద్దిపాడు: అంగన్‌వాడీ సెంటర్‌లలో చిన్నారులకు సరైన పోషకాహారం అందించాలని ఉమెన్స్ అండ్‌చైల్డ్ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ ముద్దాడ రవిచంద్ర అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని ఏడుగుండ్లపాడు సచివాలయ పరిధిలో అంగన్‌వాడీ సెంటర్‌ను, ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన సచివాలయ పరిధిలో ఏఏ వయసుల పిల్లలు ఎంత మంది ఉన్నారు, వీరిలో బడి బయట ఉన్న పిల్లలు ఎంతమందో వివరాలు తెలుసుకున్నారు. అంగన్‌వాడీ సెంటర్‌లో, ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న భోజనం నాణ్యతతో ఉండాలని సూచించారు. మెనూ ప్రకారం పెడుతున్నారా లేదా అన్న అంశాలను పరిశీలించారు. ఫ్యామిలీ ఫిజీషియన్ పథకంలో భాగంగా గ్రామాల్లో పర్యటించే క్రమంలో తప్పనిసరిగా రక్తహీనత ఉన్న చిన్నారులను పరీక్షించాలని డాక్టర్ మానసకు ఆదేశాలు జారీ చేశారు. అంగన్‌వాడీలో ఉన్న సదుపాయాల గురించి ఆయన పలువురిని ప్రశ్నించి సమాధానాలు రాబట్టారు. విద్యార్థినులకు ఐరన్ ఫోలిక్ యాసిడ్ ట్యాబ్లెట్లు ఇస్తున్నారా లేదా అంటూ విచారించారు. పాఠశాల మొత్తం తిరిగి టాయిలెట్స్ పరిశీలించారు. అనంతరం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ ప్రస్తుతం అంగన్‌వాడీ సెంటర్లలో, ప్రాథమిక పాఠశాలల్లో అదనంగా కావాల్సిన సదుపాయాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నుంచి మరింత మెరుగైన సేవలు అందించడానికి అవకాశాలను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. ఆయన వెంట ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఏఓ సుబ్బారావు గ్రామ సర్పంచ్ శిల్పసౌందర్య, వైఎస్ఆర్ సీపీ నాయకుడు గుడ్లపాతల రవి, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ వర్కర్లు సూపర్‌వైజర్ జ్యోతి, వైద్యశాఖ సిబ్బంది ఉన్నారు.

సేవల్లో ఏపీజీబీ ముందంజ

- నికరలాభం రూ. 595.15 కోట్లు
- నికర విలువ రూ. 3789.26 కోట్లు
- వ్యాపారంలో 6.11 శాతం వృద్ధి రేటు
- ఏపీజీబీ చైర్మన్ రాకేష్ కశ్యప్



మాట్లాడుతున్న ఏపీజీబీ చైర్మన్ రాకేష్ కశ్యప్

కడప సెవెన్‌రోడ్స్: ఖాతాదారులకు సంతృప్తికరమైన సేవలు అందించడంలో ఇతర బ్యాంకులకు ఏమాత్రం తీసిపోని రీతిలో తమ బ్యాంకు ముందు వరుసలో ఉందని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు చైర్మన్ రాకేష్ కశ్యప్ తెలిపారు. 2022–23 మార్చితో ముగిసిన సంవత్సరానికి సంబంధించిన ఆర్థిక ఫలితాలను మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరించారు. తమ బ్యాంకు రూ. 41,656 కోట్ల వ్యాపారంతో గడిచిన సంవత్సర కాలంలో రూ. 595.15 కోట్ల నికర లాభాన్ని సంపాదించిందని పేర్కొన్నారు. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే రూ. 2398.42 కోట్లు అదనపు వ్యాపారాన్ని నిర్వహించి 6.11 శాతం వృద్ధి రేటును నమోదు చేసుకున్నామన్నారు. సీఆర్‌ఏఆర్ చట్టబద్ధమైన లక్ష్యం 9.00 శాతానికి దీటుగా 23.90 శాతం నమోదైందని చెప్పారు. తమ బ్యాంకు రూ. 3789.26 కోట్ల నికర విలువ కలిగి దేశంలోనే అత్యధిక నెట్‌వర్క్ కలిగిన గ్రామీణ బ్యాంకుల్లో ఒకటిగా నిలువడం తమకు గర్వకారణమన్నారు. ఖాతాదారులకు ఇంటి వద్దే బ్యాంకు సేవలు అందిస్తున్నామని, 98 ఏటీఎంలు ఏర్పాటు చేశామన్నారు. బ్యాంకు ఖాతాదారులు మార్చి 31 నాటికి 57.73 లక్షల మంది కాగా, డిపాజిటర్లు 67.64 లక్షల మంది, రుణ గ్రహీతలు 16.10 లక్షల మంది ఉన్నారని వివరించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రాధాన్యత రంగాలకు అందించిన రుణాల స్థాయి రూ. 19,923 కోట్లకు చేరగా, అది మొత్తం రుణాల్లో 91.12 శాతం ఉండడం తమ బ్యాంకు ప్రత్యేకతగా చెప్పారు. వ్యవసాయ రంగానికి ఇచ్చిన రుణాల స్థాయి రూ. 16,899 కోట్లకు చేరగా ఇది మొత్తం రుణాల్లో 77.29 శాతం ఉందన్నారు.

ఈ ఏడాది లక్ష్యాలు

2023–24 ఆర్థిక సంవత్సరంలో మొత్తం వ్యాపార లక్ష్యాన్ని రూ. 45,500 కోట్లుగా నిర్దేశించుకున్నామన్నారు. మొత్తం డిపాజిట్లలో 38 శాతం కాసా డిపాజిట్లను సేకరిస్తామన్నారు. చిన్న మొత్తాల పొదుపును ప్రోత్సహించడం, పీఎంజేడీవై ఖాతాల్లో లావాదేవీలు నిర్వహించేలా అవగాహన పెంపొందించడం, రికరింగ్ డిపాజిట్లు, రీటైల్ టర్మ్ డిపాజిట్లను విరివిగా ప్రారంభిస్తామన్నారు. ఖాతాదారులకు డిజిటల్ లెండింగ్, సోషల్ బ్యాంకింగ్, యూపీఐ ద్వారా నగదు ఉపసంహరణ తదితర ఆధునిక సాంకేతిక సదుపాయాలు అందుబాటులోకి తెస్తామన్నారు. వ్యవసాయ అనుబంధ పరిశ్రమలకు, ఎంఎస్ఎంఈ రంగాలకు, గృహ నిర్మాణం, కొనుగోళ్లకు రుణ సదుపాయాలు విస్తృతంగా అందజేస్తామన్నారు. బ్యాంకు జీఎంలు జగదీశ్వర్ రావు, కె.విజయభాస్కర్, పీఆర్ పడగెటివార్, ఆర్.గిరి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కే జనం మద్దతు

- మెగా పీపుల్స్ సర్వే అందుకు సాక్ష్యం
- పక్షం రోజుల్లో కోటి కుటుంబాల సందర్శన
- కుటుంబానికి ఒక్కోటి చొప్పున 79 లక్షలకుపైగా మిస్డ్‌కాల్స్
- రాష్ట్రంలోని 3.50 కోట్ల మంది మద్దతు జగన్‌కే..
- ఇటువంటి సర్వేకు వెళ్లే దమ్ము చంద్రబాబుకు ఉందా?
- సంతనూతలపాడు శాసన సభ్యుడు టీజేఆర్ సుధాకర్ బాబు



జగనన్నే మా భవిష్యత్ మా నమ్మకం నువ్వే జగన్ ఒక కోటి కుటుంబాలను కలసిన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సుధాకర్‌బాబు తదితరులు

ఒంగోలు: జనం మద్దతు జగన్‌కే అని మెగా పీపుల్స్ సర్వేతో మరోమారు స్పష్టమైందని సంతనూతలపాడు శాసన సభ్యుడు టీజేఆర్ సుధాకర్‌బాబు అన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం కోటి కుటుంబాల సందర్శన పోస్టర్లను ప్రదర్శించారు. ఆయన మాట్లాడుతూ కేవలం 15 రోజుల్లో గడప గడపకు 7 లక్షల మంది జగనన్న సచివాలయాల గృహ సారథులు, కన్వీనర్లు గృహాలను సందర్శించి వారికి అందిన పథకాలు వివరించి వారు ఇంకా ఏం కావాలని కోరుకుంటున్నారో అడిగి తెలుసుకున్నారన్నారు. కుటుంబానికి ఒకటి చొప్పున 79 లక్షల మిస్డ్ కాల్స్ వచ్చాయని ఇవన్నీ డిజిటలైజ్డ్ అన్నారు. వీటిని ఏ ఒక్కరూ మానిప్యులేట్ చేయలేరన్నారు. ఇలా రాష్ట్రంలోని 5 కోట్ల మందిలో 3.50 కోట్ల మంది జగన్‌కు మద్దతు ప్రకటించారన్నారు. ఇందుకు ప్రధాన కారణం పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు చేపట్టిన సంక్షేమ పథకాల పరంపరే అని స్పష్టం చేశారు. నవరత్నాలతోపాటు అనేక సంక్షేమ పథకాలు అందిస్తూ వారి కష్టంలో తోడుగా జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారన్నారు. నాలుగున్నర సంవత్సరాల వైఎస్సార్ సీపీ పాలనలో వ్యక్తిగత, సామాజిక, స్త్రీల కోసం సంక్షేమ పథకాలతోపాటు అభివృద్ధిలోను దూకుడు కొనసాగిందన్నారు. విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తు వైపు పయనిస్తున్నారన్నారు. రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా 17 లక్షల కుటుంబాలకు రూ. 2.07లక్షల కోట్లు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసిన ఏకైక సీఎం వైఎస్ జగన్ అన్నారు. కరోన సమయంలో బతుకుతామా లేదా అని ప్రతి ఒక్కరూ బెంబేలెత్తుతుంటే కుల, మత, ధనిక, పేద అన్న తారతమ్యం లేకుండా రాష్ట్రంలో ప్రతి ఒక్కరిని కాపాడుకునేందుకు జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న సాహసోపేత నిర్ణయాలు నేటికీ ప్రజల హృదయాల్లో నిలిచిపోయాయన్నారు.

ప్రభుత్వాన్ని అస్థిరపరచే కుట్ర

ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ఆదరణ పెరగడంతో తట్టుకోలేక ప్రభుత్వాన్ని అస్థిరపరచాలనే కుట్రలకు పచ్చమీడియా అండతో చంద్రబాబు తెరలేపుతున్నారని ఎమ్మెల్యే టీజేఆర్ విమర్శించారు. మూడు మార్లు శాసనసభకు ఎన్నికైన దళిత మంత్రి ఆదిమూలపు సురేష్ ఇంటివద్దకు వెళ్లి చంద్రబాబు మాట్లాడిన తీరు.. దళితులంటే తెలుగుదేశం పార్టీకి ఎంత జుగుప్సగా ఉందో ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. ప్రకాశం జిల్లా అభివృద్ధి, సంక్షేమంపై టీడీపీ అయిదేళ్లపాలన, మా నాలుగున్నర సంవత్సరాల పాలనపై ఎప్పుడైనా చర్చకు సవాల్ అని ప్రకటిస్తున్నా పట్టించుకోవడంలేదని చెప్పారు. టీవీ చానళ్లు, పచ్చమీడియా ఉంది కదా అని ఊకదంపుడు ఉపన్యాసం ఇవ్వడాన్ని ఎద్దేవా చేశారు. 40 సంవత్సరాల రాజకీయ చరిత్ర అని చెప్పుకునే చంద్రబాబు నాయుడు, ఆదినారాయణరెడ్డి , చింతమనేని ప్రభాకర్‌లు ఇప్పటివరకు కూడా దళితులపై చేసిన అభ్యంతరకరమైన వ్యాఖ్యలకు క్షమాపణ కోరలేదంటే వారిలో ఎటువంటి కులహంకార ధోరణి నెలకొంందో అర్థం చేసుకోవాలన్నారు. చంద్రబాబుపై చంద్రబాబుకు నమ్మకం పోయిందని, మరో వైపు కొడుకు లోకేష్ పాదయాత్రకు జనస్పందన కరువైందన్నారు. తమ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశిస్తే గడప గడపకు వెళ్లి తాము కార్యక్రమాన్ని కొనసాగించామని, చంద్రబాబుకు కూడా దమ్ముంటే గడప గడపకు వెళ్ళి వారు అందించిన ప్రయోజనాలు వివరించి మిస్డ్ కాల్స్‌ను ఆహ్వానించాలని.. చంద్రబాబే మా భవిష్యత్తు అని ప్రజలనుంచి స్పందన పొందాలని సవాల్ చేస్తున్నామన్నారు.

జూన్ నెలాఖరునాటికి వందశాతం కుటుంబాల సందర్శన

సంతనూతలపాడు నియోజకవర్గంలో సైతం 25వేలమంది మిస్డ్ కాల్స్ ఇవ్వడం ద్వారా లక్షమంది మద్దతు ఇప్పటివరకు కూడగట్టుకోగలిగామని ఎమ్మెల్యే టీజేఆర్ అన్నారు. త్వరలోనే మిగిలిన కుటుంబాలను కూడా సందర్శిస్తామని జూన్ నెలాఖరునాటికి వంద శాతం కుటుంబాల సందర్శన పూర్తి చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం నుంచి చీమకుర్తిపట్టణంలో జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ శాసన సభ్యులు బూచేపల్లి శివప్రసాదరెడ్డి సహకారంతో గడపగడపకు కార్యక్రమం ప్రారంభిస్తున్నామన్నారు.

ఈ సమావేశంలో సంతనూతలపాడు, మద్దిపాడు, నాగులుప్పలపాడ మండలాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు దుంపా చెంచిరెడ్డి, మండవ అప్పారావు, పోలవరపు శ్రీమన్నారాయణ, చీమకుర్తి జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, చీమకుర్తి సొసైటీ చైర్మన్ ఓబుల్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ కొమ్మూరి సుధాకర్, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ ఎర్ర దశరథ, మహిళా నాయకురాలు రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

తాలూకా పోలీసు స్టేషన్‌కు ట్రైనీ ఐపీఎస్ అటాచ్



ట్రైనీ ఐపీఎస్ అంకితా సురాన (ఫైల్)

ఒంగోలు టౌన్: ట్రైనీ ఐపీఎస్ అంకితా సురాన మహవీర్‌ను శిక్షణ నిమిత్తం ఒంగోలు తాలూకా పోలీసు స్టేషన్‌కు అటాచ్ చేస్తూ ఎస్పీ మలికా గర్గ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. శిక్షణలో భాగంగా మే 20 వరకు నాలుగు వారాల పాటు ఇక్కడ పనిచేస్తారు.

సాంఘిక సంక్షేమ శాఖ పోస్టర్ ఆవిష్కరణ

ఒంగోలు అర్బన్: సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న వసతి గృహాలు, విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే ప్రత్యేకంగా రూపొందించిన పోస్టర్‌ను మంగళవారం కలెక్టర్ ఛాంబర్‌లో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రిమేరుగ నాగార్జున చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ పోస్టర్ ద్వారా మూడవ తరగతి నుండి డిగ్రీ ఆపై తరగతుల వరకు కల్పించే వసతి గృహ సదుపాయాలను తెలియచేస్తూ రూపొందించారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కోరారు. సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో నూరుశాతం ప్రవేశాలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. దీనిలో పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, కలెక్టర్ దినేష్‌కుమార్, ఎమ్మెల్యేలు మద్దిశెట్టి వేణుగోపాల్, బుర్రా మధుసూదన్ యాదవ్, కె.నాగార్జునరెడ్డి, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, సబ్ కలెక్టర్ సేతు మాధవన్, సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్ తదితరులు పాల్గొన్నారు.